క్లుప్తంగా

పాదుకల శోభాయాత్ర



రెంజల్(బోధన్): అయోధ్య శ్రీరాముని పాదుకలతో రెంజల్‌లోని ప్రధాన వీధుల్లో మహిళలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శోభాయాత్ర నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రామనామస్మరణతో రెంజల్‌లోని వీధులు మారుమోగాయి.

విఠలేశ్వరాలయంలో పూజలు

నవీపేట : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని యంచ శివారులో ఉన్న పాండురంగవిఠలేశ్వరాలయంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రాంకిషన్‌రావు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు భవంతి దేవీదాస్, యంచ, పాతంగల్ గ్రామాల సర్పంచులు కొట్టాల లహరి, రవీందర్‌రావు, నాయకులు రాజేశ్వర్, సంజీవ్, ప్రవీణ్, లాలుయాదవ్, అంజలి తదితరులున్నారు.

విద్వేషాలను రెచ్చగొట్టే వారిని ఓడించాలి



వర్ని: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్రపక్షాలను చిత్తుగా ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు ప్రజలను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో వర్ని ఏరియా పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నాయకుడు మేకల మల్లేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ.. ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టే పార్టీలను ఓడించి, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వాదాన్ని ఓటర్లు కాపాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గంగాధరప్పా, సాయాగౌడ్, బొర్ర గంగాధర్, నాగనాథ్, గణపతి, గంగామణి, సాయిబాబు, గాయత్రి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లలో వైద్య శిబిరాలు



మాక్లూర్: మండలంలోని గుత్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూర్య ఆరోగ్య సంస్థ, తిరుమల డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత, కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత, కళ్ల సంరక్షణపై వైద్యులు నితీశ్‌కుమార్, శ్రీకాంత్ అవగాహన కల్పించారు. సూర్య ఆరోగ్య సంస్థ సీఓఓ రాజేంద్రకుమార్, హెచ్‌ఎం ధృపతికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డేపల్లిలో..



వర్ని: మండల కేంద్రంలోని వడ్డేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శ్రీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు . 100 మంది విద్యార్థులకు, ఆరుగురు ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు.

బాలికలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



వేల్పూర్: బాలికలు తమ హక్కులపై అవగాహన పెంపొందిచుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ పేర్కొన్నారు. మండలంలోని పచ్చలనడ్కుడ కస్తూర్బాస్కూల్‌లో అంతర్జాతీయ బాలికల హక్కులపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలికలు ఉన్నత విద్యావంతులు కావాలని, అప్పుడే హక్కులను తెలుసుకొని, ఇతర బాలికలకు మార్గదర్శకులుగా ఉంటారన్నారు. సమావేశంలో భీమ్‌గల్ ఐసీడీఎస్ సీడీపీవో సుధారాణి, నడ్కుడ సెక్టార్ సూపర్‌వైజర్ గంగహంస, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి వినోద, సెక్టార్ లీడర్ స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ఆశీర్వదించండి

- నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాను
- ఎన్నికల ప్రచారంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి





అమీనాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి.. మంత్రికి బోనాలతో స్వాగతం పలుకుతున్న లక్కోర గ్రామస్తులు

వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలోని గ్రామాలను రాజకీయ పార్టీల కోణంలో చూడకుండా అభివృద్ధి చేశానని, పార్టీలకతీతంగా తనను ఆశీర్వదించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు. వేల్పూర్ మండలం అమీనాపూర్, లక్కోర గ్రామాల్లో ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం నీటిని పోచంపాడ్‌లో నింపడం ద్వారా గుత్ప, నవాబు ఎత్తిపోతల పథకాలకు నీటిద్వారా అమీనాపూర్, లక్కోర చెరువులకు నీటి కొరత లేకుండా చేశానన్నారు. ఎండాకాలంలోనూ చెరువులను నింపగలిగామని పేర్కొన్నారు. కులసంఘాల భవనాలకు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు తెచ్చానని, ప్రొసిడింగ్‌లు ఒట్టి కాగితాలని దిగజారి దుష్ప్రచారం చేస్తున్నారని, ఇవి వట్టి కాగితాలు కావు, గట్టి కాగితాలని స్పష్టం చేశా రు. కుల సంఘాల భవనాలు , గృహలక్ష్మి ఇండ్ల నిర్మాణాలు మొదలు పెట్టుకోవచ్చన్నారు. బిల్లులు తప్పకుండా వస్తాయని, అందుకు తానే జిమ్మేదారునని చెప్పారు. మంచి మెజారిటీతో గెలిపిస్తే కేసీఆర్ తనను మంచి స్థానంలో ఉంచుతారని చెప్పా రు. తాను మంచి స్థానంలో ఉంటే మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు సగానికి పైగా పైరవీకారులు దోచుకున్నారన్నారు. కేసీఆర్ మళ్లీ గెలిస్తే సంక్షేమ పథకాలు నిరవధికంగా కొనసాగుతాయని అన్నా రు. కరోనా కాలంలో సైతం రైతుబంధు, పింఛన్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఇప్పుడు వేయనున్న ఓటు మన అభివృద్ధిని, సంక్షేమాన్ని కొనసాగించుకునే ఓటు అని అన్నారు. మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే ఐదేళ్లపాటు సేవ చేస్తానన్నారు. కార్యక్రమంలో ఐబిహెచ్‌ఎఫ్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఎంపీపీ భీమజమున, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు

- బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి



ప్రచారానికి హాజరైన జలాల్‌పూర్ గ్రామస్తులు



నాగాపూర్‌లో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

బాల్కొండ/భీమ్‌గల్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాల్కొండ మండలం జలాల్‌పూర్, ఇత్వార్‌పేట్, నాగాపూర్ గ్రామాలతోపాటు భీమ్‌గల్ పట్టణం, ముచ్కూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారన్నారు. కర్ణాటక ఎమ్మెల్యే ప్రదీప్ తమ రాష్ట్రంలో అమలు అవుతున్న పథకాలను చూపిస్తా అని విసిరిన సవాలును మంత్రి ఎందుకు స్వీకరించలేదో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రశాంత్‌రెడ్డి నోరు తెరిస్తే అన్ని అబద్ధాలు మాట్లాడుతున్నాడన్నారు. ప్రజలు నమ్మి రెండుసార్లు అధికారమిస్తే గ్రామాల్లో రౌడీ రాజ్యం ఏర్పాటు చేశారన్నారు. అంతే కాకుండా యువతను గంజాయి వైపు నడిపించి వారి భవిష్యత్‌ను నాశనం చేశాడన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు మేనిఫెస్టోలో చెప్పిన వాటిని అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఇప్పటికీ చెక్కు చెదరలేదని, బీఆర్‌ఎస్ హయాంలో కట్టిన కాళేశ్వరం ఐదేళ్లకే కుంగిపోయిందన్నారు. కేవలం ధనదాహంతోనే ప్రాజెక్టులు కట్టి ప్రజలను నట్టేట ముంచారని ఆరోపించారు. అహంకార మంత్రికి ఎన్నికల్లో "బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల్లో సునీల్‌రెడ్డికి మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, సీనియర్ నాయకుడు జక్క రాజేశ్వర్, శ్రీనివాస్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనందరిదీ భగవంతుని కుటుంబం

నిజామాబాద్ సిటీ: సమాజంలోని ప్రతి ఒక్కరూ భగవంతుని కుటుంబమేనని, అందరూ కలిసి ఉండాలని శ్రీ త్రిదండి చినరామానుజ జీయర్ స్వామి అన్నారు. నగరంలోని సుభాష్‌నగర్ రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీ సీతారామచంద్ర స్వామి పవిత్రోత్సవాలకు చినజీయర్ స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ధర్మం, కర్మ, సంప్రదాయం, సంస్కృతి ఇది అని తెలియజేసే కేంద్రాలుగా ఆలయాలను తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సరళ మహేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం స్వామిజీ మారుతినగర్‌లోని భక్తుడు గడీల రాములు ఇంట్లో బస చేశారు. శనివారం నిర్వహించనున్న కార్యక్రమాల్లోనూ స్వామిజీ పాల్గొననున్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మాటలు నమ్మొద్దు



కుర్నాపల్లిలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి



ప్రచారానికి హాజరైన కుర్నాపల్లి గ్రామస్తులు

ఎడపల్లి(బోధన్): కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వారు కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను వాగ్దానాలతో మోసం చేస్తున్నారని బోధన్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని మంగళపాడ్, కుర్నాపల్లి, ఠానాకలాన్, ఎమ్మెస్సీ ఫారం, పోచారం, నెహ్రూనగర్, జానకంపేట గ్రామాల్లో మోహన్‌రెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు ఆయనకు మంగళహారలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రానికి లక్షల కోట్ల నిధులు వచ్చాయన్నారు. మండలంలో రూర్బన్ పథకం ద్వారా ఆయా గ్రామాలకు వచ్చిన రూ.30 కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చినవేనని అన్నారు. ప్రతి ఒక్కరికీ కరోనా సమయం నుండి ఇప్పటివరకు 10 కిలోల ఉచిత బియ్యం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఐదేళ్లపాటు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్వింటాలు వరి ధాన్యానికి రూ.3000 ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక్కసారి బీజేపీ ఓటు వేసి గెలిపిస్తే మీకు దగ్గరుండి సేవలు చేసుకునే భాగ్యం తనకు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇంద్రకరణ్, శ్రీధర్, రాజేందర్, కమలాకర్ రెడ్డి, రవి, రాంరెడ్డి, సంతోష్‌రెడ్డి, సూర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓట్ ఫ్రం హోం





బాల్కొండ/ఆర్మూర్ టౌన్: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో రెండోరోజైన శుక్రవారం ఓట్ ఫ్రం హోం ప్రశాంతంగా కొనసాగింది. 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు తమ ఇళ్లలోనే ఓటు వేశారు. ఎన్నికల సిబ్బంది అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయగా, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్మూర్ నియోజకవర్గంలో 239 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

అవినీతి పాలకులను సాగనంపుదాం

- బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలు
- బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న మహిళలు



రెంజల్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

రెంజల్(బోధన్): అవినీతి పాలకులను ఈ నెల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో ఓటుతో సాగనంపాలని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సూచించారు. రెంజల్‌లో సుదర్శన్‌రెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన పూర్తిగా అవినీతి, అక్రమాలతో సాగిందని ఆరోపించారు. చోటా, మోటా నాయకుల నుంచి మంత్రుల వరకు ఆరితేరారని, బోధన్ నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలిసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలో బీజేపీ చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మర్చిపోయారన్నారు. ఫలితంగా రాష్ట్రంలో అన్ని వర్గాలు అవస్థలను ఎదుర్కొంటున్నారన్నారు. నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగం కూడా పాలకుల కనుసన్నల్లో పనిచేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అవినీతికి పాల్పడిన పాలకులతోపాటు వారికి అండగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మూడెకరాల భూమి, నిరుద్యోగ భృతి వంటివి ఎందుకు అమలు చేయడంలేదని నిలదీశారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు రోడ్ల మీదకు వస్తున్నారన్నారు. మనం కలలుగన్న తెలంగాణను అభివృద్ధి చేసుకునేందుకు కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను అధికారంలోకి వచ్చిన ఏడాదిలో అమలు చేస్తామన్నారు. ముందుగా రెంజల్‌లోని శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం శివాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు గ్రామస్తులతో ర్యాలీగా తరలివచ్చారు. నాయకులు నాగభూషణంరెడ్డి, మోబీన్‌ఖాన్, ధనుంజయ్, సాయారెడ్డి, రాములు, సాయిబాబాగౌడ్, ఇందిరా రెడ్డి, కవిత, జావీద్, హన్మంత్‌రావ్, పోచయ్య, శ్రీనివాస్‌యాదవ్, ఆసాని వేణు, కృష్ణ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలో చేరినవారితో పోచారం సురేందర్‌రెడ్డి

రుద్రూర్: మండల కేంద్రానికి చెందిన మైనార్టీ యువకులు 20మంది శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు పత్తి లక్ష్మణ్, ఎస్ బాలరాజ్, జెడ్పీటీసీ నారోజి గంగారాం, పత్తి రాము, తోట్ల గంగారాం, మైనార్టీ నాయకులు అహ్మద్ హుస్సేన్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

- ఏటేటా పెరుగుతున్న బడ్జెట్ కేటాయింపులు
- బీఆర్‌ఎస్ ఆర్మూర్ అభ్యర్థి జీవన్‌రెడ్డి



నందిపేటలో జీవన్‌రెడ్డికి తీర్మానప్రతిని అందజేస్తున్న మైనారిటీలు



ఆర్మూర్‌లో మున్నూరుకాపు ఆత్మీయసమ్మేళనంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

ఆర్మూర్/నందిపేట్ : బీఆర్‌ఎస్‌కు సర్వమతాలు సమానమేనని, కేసీఆర్ పాలనలో మైనార్టీలకు పూర్తి రక్షణ ఉందని ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ఆర్మూర్ పట్టణంలో జమాతే ఉల్మా ఐ హింద్ బీఆర్‌ఎస్‌కు మద్దతు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో మైనారిటీ పెద్దలు జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. నందిపేట మండల కేంద్రంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో తమ మద్దతు బీఆర్‌ఎస్‌కేనని మైనార్టీ పెద్దలు ప్రకటించి బీఆర్‌ఎస్‌లో చేరారు. నందిపేట్, డొంకేశ్వర్ మండలాల్లోని మసీదులకు చెందిన మైనారిటీ సోదరులు, జమాతే కమిటీలు బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అన్ని రంగాల్లో వారి అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. 2014 నుంచి మైనారిటీ సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులు పెంచుతూ వస్తున్నారన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌లో రూ.1724.69 కోట్లు కేటాయించిందని, పిల్లలకు నాణ్యమైన విద్యనందించేందుకు 204 మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను అందిస్తోందన్నారు. ఇప్పటివరకు 2,725 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించినట్లు వివరించారు. షాదీ ముబారక్ పథకం ద్వారా లబ్ధిదారులకు రూ.1,00,116 ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఆర్మూర్ ప్రజల అభిమానంతో తాను మళ్లీ గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఆర్మూర్ నియోజకవర్గంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టే కుట్రలతో కాంగ్రెస్, బీజేపీలు వస్తున్నాయని ఆయన మండిపడ్డారు. అరాచక శక్తుల ఆటలు సాగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు ఆలోచించి ఓటేయాలని, బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టి అభివృద్ధిని గెలిపించాలని జీవన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

మున్నూరుకాపులు ఆత్మబంధువులు

ఆర్మూర్ నియోజకవర్గంలోని మున్నూరు కాపులు తనకు ఆత్మబంధువులని జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలంలోని ఐదు పంతాలకు చెందిన మున్నూరుకాపులు నిర్వహించిన ఆత్మీయసమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని సంక్షేమ పథకాల్లో మా పటేళ్లకు భాగస్వామ్యం ఉందని మున్నూరుకాపులను ఉద్దేశించి అన్నారు. ఆర్మూర్, నందిపేట్ తదితర ప్రాంతాల్లో మున్నూరు కాపు సోదరులకు అద్భుతమైన ఫంక్షన్ హాళ్లు నిర్మించామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు.

పార్టీలో చేరిక

నందిపేట్ పట్టణంలోని మున్నూరుకాపు యువకులు జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అర్సపల్లి రమేశ్, ఏశాల రాజు, నాగుల సుధాకర్, ఏశాల భూమేశ్, పి రాజేందర్, నాగుల శ్రీను, కాల భోజన్న, ఎర్రం సుభాష్, నాగుల మహిపాల్, ఏశాల లింగం తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం



కిసాన్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కూనేపల్లిలో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

సాక్షి నెట్‌వర్క్ : బోధన్, బాల్కొండ, ఆర్మూర్, బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని గ్రామాల్లో ఆయా పార్టీల అభ్యర్థులకు మద్దతుగా నాయకులు, కార్యకర్తల ప్రచారం కొనసాగుతున్నది. బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి దీప్తి కిసాన్‌నగర్‌లో ప్రచారం చేశారు. బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి రుద్రూర్ మండలం చిక్కడ్‌పల్లి గ్రామంలో నాయకులతో కలిసి ప్రచారం చేశారు. బోధన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్‌కు మద్దతుగా రెంజల్ మండలం కూనేపల్లి గ్రామంతో పాటు బోధన్ పట్టణంలో నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. బాల్కొండ అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా బీఆర్‌ఎస్ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహించాయి.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – మంగళవారం (తెలుగు)- 12.25, 7.00
టైగర్-3 (తెలుగు)-3.35, 10.10

స్క్రీన్-2 – ఆదికేశవ (తెలుగు)- 11.00, 1.50, 4.40, 7.30, 10.20

స్క్రీన్-3 – కోటా బొమ్మాళి పీఎస్ (తెలుగు)- 10.00, 1.00, 7.10, 10.10
మంగళవారం (తెలుగు)- 4.00

స్క్రీన్-4 – టైగర్-3 (హిందీ)- 10.15,
మాధవే మధుసూదనా (తెలుగు) 4.00
సౌండ్‌పార్టీ(తెలుగు)7.00
ఫర్‌పూమ్ (తెలుగు) 9.45

దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలివి

- ఏఐసీసీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షానవాజ్ హుస్సేన్



బోధన్‌లో మాట్లాడుతున్న షానవాజ్ హుస్సేన్

బోధన్/బోధన్‌టౌన్: ఈ ఎన్నికలు తెలంగాణ అసెంబ్లీకే కాకుండా దేశ భవిష్యత్, ఐక్యతను నిర్ణయించే ఎన్నికలని ఏఐసీసీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు, జమ్మూకశ్మీర్‌కు చెందిన నాయకుడు షానవాజ్ హుస్సేన్ అన్నారు. బీజేపీ దేశాన్ని విడగొట్టాలని చూస్తున్నదని విమర్శించారు. జమ్మూకశ్మీర్‌ను విడగొట్టి ఆ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, అక్కడ రెండేళ్లుగా బీజేపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. ఆ రాష్ట్ర ప్రజలు ప్రజాస్వామ్యం కోసం తెగువతో పోరాడుతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచార బహిరంగకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ ఐక్యత కోసం రాహుల్‌గాంధీ కొనసాగిస్తున్న పోరాటానికి తెలంగాణ ప్రజలు తోడుగా ఉంటారని భరోసా ఉందన్నారు. ఈసారి తెలంగాణతోపాటు నాలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీములపై బీఆర్‌ఎస్ దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కర్ణాటక రాష్ట్రంలో ఇచ్చిన గ్యారంటీ స్కీములు అమలవుతున్నాయని, దమ్ముంటే అక్కడ వెళ్లి చూడాలన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కవిత ఉన్నారనే ఆరోపణలు ఉన్నప్పటికీ బీజేపీ దీవెనలతోనే సీబీఐ, ఈడీ ఆమెను విడిచిపెట్టాయని వ్యాఖ్యానించారు. మచ్చలేని నాయకుడైన కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రచార సభలో బీహార్‌కు చెందిన మైనార్టీ నాయకుడు ఒమర్‌ఖాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గంగాధర్ రావు పట్వారి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మోహినొద్దీన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు చైతన్య ర్యాలీ



ఖలీల్‌వాడి: నగరంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు చైతన్య ర్యాలీని తెలంగాణ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. నాందేవ్‌వాడ, హమాల్‌వాడి, బస్టాండ్, గంజ్ మీదుగా దుబ్బ వరకు ర్యాలీ కొనసాగింది. ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్‌రావు, కళాశాల కార్యదర్శి సుజన్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి దత్తు, అధ్యాపకులు వేణుగోపాల్, రచన, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.